శారీరక లోపం ఉన్నవాళ్ళే అవిటివాళ్ళు కాదు. మానసిక వికారం శారీరక అవిటితనానికన్నా వికృతమైందీ, సమాజానికి హానికరమైనదీనూ!

# అవిటివాళ్లు

వైశాఖ మాసం అప్పటికే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పదకొండు గంటల వేళ గునుపూడి వీధిలో ఖద్దరు బనీను, ఖద్దరు పంచె ధరించిన ఓ నడివయస్కుడు భుజాన ఓ గుడ్డ సంచీ వేలాడేసుకుని వగర్చుకుంటూ నడుస్తున్నాడు. స్థూలకాయమూ, బుర్రలో ముసిరే ఆలోచనలూ దానికి దోహదం చేశాయి. ధారాపాతంగా కారే చెమటని పంచె చెంగుతో తుడుచుకుంటూ, కుడివైపుగా ఓ ఎత్తరుగుల ఇంటి ముందాగి, ఎగాదిగా చూసి, బుర్ర తాటించి లోపలకు అడుగు పెట్టాడు.

అడుగు పెడుతూనే వరండాలో పేము కుర్చీలో కూలబడి, ''అమ్మా! సుభద్రమ్మా! ముందుగా ఓ గ్లాసుడు చల్లటి మజ్జిగ దాహం అందుకో అమ్మా! నాలిక పిడచ కట్టుకుపోతుంది. ఇంకా మధ్యాహ్నమైనా కాలేదు ఎండ ఎంత తీక్షణంగా ఉందో! ఉస్సు! అబ్బ!'' అన్నాడు. మజ్జిగతో వచ్చిన సుభద్రమ్మ గ్లాసాయన కందించి,''అయ్యో! పంతులుగారూ! వేసవి కదా! ఇలా ఎండలో నడుచుకుంటూ వచ్చేశారు. ఓ గొడుగైనా తెచ్చుకోలేక పోయారా?'' అంది. చటుక్కున మజ్జిగ గ్లాసందుకుని, ఒక్క గుక్కలో ఖాళీ చేసి బల్ల మీద పెడుతూ సుభద్రమ్మను చూశాడు పంతులు. లక్ష్మీదేవిలా నుదుట రూపాయి కాసంత కుంకుమ బొట్టుతో, పమిట చెంగు భుజాల చుట్టూ పట్టుకుని, గుమ్మాని కానుకుని నిలబడి ఉంది సుభద్రమ్మ.

''ఏ ఎండకాగొడుగు పట్టే అంతటి సంసారాలటమ్మా మనవి? ఎండకీ, వానకీ ఢక్కా మొక్కీలు తింటూ, తుపాన్లను తట్టుకుంటూ జీవితాన్ని నెట్టుకుపోవాలిగాని. వాటికి అలవాటు పడ్డమే కాని, వాటినుండి రక్షణ పొందడం మనలాంటి సామాన్యులకి సాధ్యమా! ఇంతకీ ఈ సంవత్సరమైనా వసంతకి పెళ్లి చేస్తున్నారా లేదా? బియ్యే పాసై నాలుగేళ్లుగా ఇంట్లో ఉంది. ఈ వయసు దాటితే సంబంధాలు దొరకడం కూడా కష్టం'' అన్నాడాయన.

''ఏం చెప్పమంటారు పంతులుగారూ! నాకు మాత్రం దాన్ని గురించి బెంగ లేదంటారా? ఆడదాన్ని, నేనాయనతో పోరు పెట్టడం తప్ప ఏం చేయగలను? మీకు

తెలుసుగా! ఆయనకివేమీ పట్టవు. నిమ్మకు నీరెత్తినట్లుంటారు. అంతా అదోరకం వేదాంతం! మొన్నటిదాకా మాస్టరు గిరీ వెలగెట్టారు. అయ్యవారి నట్టిల్లు అన్న సామెత ఉండనే ఉంది. ఏదో గుట్టుగా సంసారం చేసుకొచ్చాను. ఆయన ఇంటి విషయాలెప్పుడు పట్టించుకున్నారనీ! ఎప్పుడూ నలుగురు స్నేహితుల్ని చేరవేయడం, పేకాటలో మునిగిపోవడం. ఈ మధ్య రిటైరయ్యాక మరీ ఎక్కువైపోయింది. అదిగో చూడండి. సావిట్లో గజం బద్ధ మింగేటట్లు నిటారుగా కూర్చుని ఆ నలుగురూ! ఏమైనా అంటే 'మరి ఉబుసుపోక ఎలాగే?' అంటారు" అని ఊపిరి తీసుకోడానికి ఆగింది సుభద్రమ్మ.

"సరే! సుబ్బారావు సంగతి నువ్వు నాకు చెప్పాలేంటి? నాకు తెలియంది కనకనా! వాడి మీద ఆశ వొదులుకుని నీ కూతురి పెళ్లి బాధ్యత నా భుజాల మీద పెట్టు. చెప్పులరిగేలా తిరిగైనా ఏదో ఓ సంబంధం ముడి పెట్టించేస్తాను. ఎదిగిన పిల్లని ఎంతకాలమని ఇంట్లో పెట్టుక్కూచుంటావు? నువ్వు 'ఊ' అను తతిమ్మాది నేను చూసుకుంటాను" అన్నారు పంతులుగారు.

సుభద్రమ్మ ఎంతో అబ్బురపడింది. ఈ మాత్రం సాంత్వన వాక్యాలు ఏనాడైనా భర్త తనతో అని ఉంటే, ఈ సంసారాన్ని సునాయాసంగా ఊదేసి ఉండేది. "అంతకంటేనా అన్నయ్యగారూ! మీ కంటే మాకు కావలసిన వాళ్లెవరున్నారు. ఏదైనా సంబంధం ఉంటే మాట్లాడి పెట్టండి. మా స్థితిగతులు మీకు తెలియనివి గావు. ఉన్న దాంట్లోనే ఘనంగా పెళ్లి చేసి పంపుతాము. ఈ పుణ్యం కాస్త మీరు కట్టుకుంటే చచ్చి మీ కడుపున పుడతాను" అంది ఆశగా సుభద్రమ్మ.

"అదీ! అలా అన్నావు బావుంది. అసలు నేనా ప్రయత్నంలో ఉండబట్టే ఇవ్వాళ నీ దగ్గర ఈ మాట ఎత్తాను. నర్సీపట్నంలో కశింభొట్ల వారి సంబంధం ఒకటుంది. వాళ్లీమధ్య నా వెంటబడ్డారు, వాళ్ల పెద్దబ్బాయికి మంచి సంబంధం చూసి పెట్టమని. ఇంటి పెద్ద కాలం చేసి సంవత్సరం దాటిందనుకో. అత్తగారు అమాయకురాలు. ఇంటికి పెద్ద కోడలుగా మీ అమ్మాయి రాజ్యం చేస్తుందనుకో. పెద్దగా ఉన్నవాళ్లు కాకపోయినా తిండికి లోటు లేదు. ముఖ్యంగా చెప్పొచ్చేదేమిటంటే, వాళ్లకి కట్నకానుకల మీద ఏమీ ఆశ లేదు. లాంఛన ప్రాయంగా పెళ్లి చేసి పిల్లని పంపుతే చాలునంటున్నారు. కాకపోతే పిల్లాడికి ఏదో చిన్న అవకరం ఉంది. అందువల్ల ఎక్కువగా చదువుకోలేదుట. అదీ ఒకందుకు మంచిదే అనుకో! మన పిల్ల చదువు ఎక్కువ కనుక ఎప్పుడూ దీని మాటే చెల్లుతుంది ఆ యింట్లో. మరయితే కుదిర్చేయమంటారా?" అడిగారు పంతులుగారు.

సుభద్రమ్మకామాటలు చెవుల్లో అమృతం పోసినట్టు వినిపిస్తున్నాయి. మధ్యాహ్నపు టెండ, పున్నమి వెన్నెలలా తోచింది. తన అదృష్టాన్ని తనే నమ్మలేకపోతోంది. నిజంగా అదృష్టం ఇలా వచ్చి తలుపు తట్టుతుందని తనేనాడూ కలలు కనలేదు. "ఇంకా అడుగుతున్నారా అన్నయ్య గారూ! వాళ్ళకభ్యంతరం లేకపోతే ముహూర్తాలు కూడా పెట్టించుకు రండి. ఇది ఆయన మీద ఆధారపడితే అయ్యే పని కాదు. వసంత మీ కూతురే అనుకోండి. దాన్ని

అత్తారింటికి పంపే బాధ్యత మీదే మరి. ఏదో చిన్న చిన్న లోపాలుంటే, అవే సర్దుకుపోతాయి. అన్నీ సవ్యంగా ఉన్న సంబంధమే కావాలని కొర్రెక్కి కూచోడానికి, మేమేమైనా అంత శ్రీమంతులమా? అడిగినా, అడిగినంత దానికి మేమూ తూగగలగాలి గదా!" అని తన మనసులోని మాట చెప్పేసింది సుభద్రమ్మ.

"మరయితే మధ్యాహ్నం బస్సుకు బయల్దేరి నర్సీపట్నం వెళ్లొస్తాను. శుభస్య శీఘ్రం!" అని లేవబోయాడు పంతులుగారు.

"అయ్యో! నా మతిమండా! మాటల గొడవలో మరిచే పోయాను. కూర్చోండి అన్నయ్య గారూ! ఇవ్వాళ ఆయన స్నేహితుల్ని తీసికొచ్చి ఈ యింట్లో పేకాట వేశారు గదా అని పులిహోర, బొబ్బట్లు చేశాను. తీసుకొస్తాను. కొంచెం తిని వెళ్లండి" అని హడావుడిగా లోపలికెళ్లింది.

లేవబోయిన పంతులు నోట్లో నీరూరుతుండగా అలాగే కుర్చీలో మళ్లీ స్థిరపడ్డాడు. ఈలోగా ఏదో పనిమీద బైటికి వెళ్లిన వసంత వీథిలోంచి లోపలికొచ్చింది. ఆమెను చూసి పంతులుగారు నవ్వుతూ, "ఏమే పెళ్లికూతురా! మంచి ఎండలో ఎక్కడి నుంచొస్తున్నావు. చూడు ఆ మొహం ఎలా కందిపోయిందో. ఈనాల్రోజులూ కాస్త ఇంటిపట్టున ఉండి కాస్త నాజూకుగా తయారవు" అని పలకరించాడు.

వసంత సమాధానం చెప్పకుండా లోపలి గదిలోకి దారితీసింది. పులిహోర, బొబ్బట్లుతో కడుపు నింపుకుని, మరో గ్లాసు మజ్జిగ పట్టించి బ్రేవుమని త్రేన్చారు పంతులుగారు. నర్సీపట్నం లో ఎలా మాట్లాడాలో నెమరు వేసుకుంటూ ఇంట్లోంచి బైట పడ్డారాయన.

తల్లీ కూతురూ వంటింట్లో కూచుని భోజనం చేస్తూండగా వసంత, "ఏంటమ్మా పంతులుగారంటున్నారు?" అని అడిగింది. ఈ పెళ్లిళ్ల పంతులు ఏవో సంబంధాలు తేవడం, కట్నకానుకల దగ్గర తిరిగి పోవడం, ఈ కథ చర్వితచర్వణంగా సాగుతున్నదే అని తెలిసినా, అదేమిటో తెలుసుకుందామని అడిగింది.

"ఏముందమ్మా! నాకెప్పుడూ నీ గురించి చింతేకదా! ఆయన నర్సీపట్నంలో ఏదో సంబంధం ఉందని చెప్పారు. నా కన్నివిధాలా నచ్చింది. ముహూర్తాలు పెట్టించేయమని చెప్పాను" అంది తల్లి.

"అదేంటమ్మా! వాళ్లెవరో? కుటుంబం ఏమిటో? ఒకసారి చూడనైనా చూడకుండా ముహూర్తాల వరకూ వెళ్లిపోయావు" అంది వసంత. "చూడమ్మా! వసంతా! నీ ఉద్దేశం పెళ్లి చూపులయితే ఈ సారికి నేనా తతంగం లేకుండానే సంబంధం ఖాయం చేసేద్దామను కుంటున్నాను. ఇంతకు మునుపు ఎన్ని సంబంధాలు పెళ్లిచూపులయి పిల్ల నచ్చిందన్నాక కూడా తిరిగిపోలేదు? నాకైతే మనకది అచ్చిరాలేదనిపిస్తోంది. నువ్వు చదువుకున్న దానివి. నీకు నేను చెప్పేదేముంది? మన ఇంటి విషయం అంతంత మాత్రం. మనం వాళ్ల దగ్గర్నుంచి ఏమైనా ఆశించినా, దానికి మన తాహతు కూడా కలిసి రావాలి కదా! నీకా వయసు వచ్చేస్తోంది.

ఏమో! ఈ సంబంధం వాళ్లు వప్పుకుంటే, నిన్నొక ఇంటిదాన్ని చేసి ఒడ్డున పడదామను కుంటున్నాను. ఇంక నువ్వేమీ అభ్యంతరం చెప్పకు. నువ్వు కాదంటే ఏ నుయ్యో, గొయ్యో చూసుకోవడమే నా గతి" మజ్జిగ అన్నం పూర్తిచేసి చెయ్యి కడుక్కుంటూ అంది సుభద్రమ్మ.

వసంత ఇంకా పప్పన్నంలోనే ఉంది. కొరుక్కున్న పచ్చిమిరపకాయ కారం నసాళానికెక్కి కన్నీళ్ళు ప్రవహింపజేసింది. ఆ తర్వాత తిన్న అన్నం రుచెరుగదు. పరధ్యానంగానే పూర్తిచేసి చెయ్యి కడుక్కుంది. గదిలో కెళ్లి, మంచం మీద పడుకుని మనసు మరల్చడానికి ప్రయత్నంగా, పుస్తకం తెరిచింది.

* * *

పంతులుగారు నర్సీపట్నంలో పెళ్లివారితో ఏం మంతనాలు జరిపాడో పెరుమాళ్లకెరుక. పెళ్లికి ముహూర్తం నిశ్చయం చేసుకొచ్చేశాడు. పదిహేను రోజుల్లో ముహూర్తం. తిరిగి ఆలోచించుకోవడానికి అవకాశం లేకుండానే పెళ్లి రోజు వచ్చేసింది. బస్సులో పాతికమంది వరకూ పెళ్లివారు దిగారు. జీలకర్రా, బెల్లం, మంగళసూత్రధారణం వంటివి తప్ప, సుమారు అన్ని తంతులూ, ఆనవాయితీ లేదనీ, అలవాటు లేదనీ తప్పించేశారు పెళ్లివారు. పెళ్లికూతురూ, పెళ్లికొడుకు ఒకర్నొకరు చూసుకునే అవకాశం ఆ మూడు ముళ్లూ వేసిన మూడు క్షణాలే! పురోహితుడు 'మాంగల్యం తంతునా' చదువుతూండగా, ఇద్దరు స్నేహితులు వచ్చి పెళ్లికొడుకుని చెరోవైపు పట్టుకుని లేవదీసి అతని చేత, వసంత మెడలో మంగళసూత్రం కట్టించారు. తలవొంచుకొని కూర్చున్న వసంత హతాశురాలైంది. అతని కాలు ఒకటే నేల మీద నిలబడింది. రెండోది పుల్లలా వేలాడుతోంది. వసంత తన అదృష్టం అంతంత మాత్రమేనని ఎప్పుడో రాజీ పడింది. కాని విధి ఇంత కసిగా కాటేస్తుందని కలలో కూడా ఊహించలేదు. విషయం అర్థం చేసుకున్న వసంత తన జీవితం శిశిరంలో చెట్టులా మోడువారి పోవడం కళ్లారా చూసింది. భావి జీవితంలో నూరు వసంతాలు భగ్గున మండి బూడిద పాలయ్యాయని గ్రహించింది. తన కాళ్ల క్రింద నేల బ్రద్దలయి తానలా భూస్థాపితం అయిపోవాలని భూదేవిని కోరుకుంది. పురాణ కాలంలో అలా జరిగేదట. ఇప్పుడెందుకు జరగదో మరి! ఏం జరుగుతోందో తెలుసుకునే లోపునే నూతన వధూవరుల్ని తీసుకుని పెళ్లివారు విడిదిలో గృహప్రవేశం చేశారు.

అలా వసంత గుమ్మం దాటిన ఆ ఇల్లు పెళ్లి జరిగిన ఇల్లులా లేదు. కాగూడని కార్యం జరిగినట్లుగా వాతావరణంలో విషాదం తాండవిస్తోంది. అందరూ ముభావంగా ఏదో పనిలో నిమగ్నమైనట్టుగా ప్రవర్తిస్తున్నారు. ఎవరెవరితో మాట్లాడినా మిన్ను విరిగి మీద పడుతుందన్నట్టు తప్పించుకు తిరుగుతున్నారు.

జరిగిపోయిన ప్రమాదానికి తానే కారణం అని గ్రహించిందేమో సుభద్రమ్మగారు. కాని ఇప్పుడు వెనుకడుగు వేయగలదా? వెనుక నుయ్యి, ముందు గొయ్యి అయిందామెకు. 'పెళ్లి కాదిది పెటాకులు' అని వచ్చిన వాళ్లని వెళ్లగొట్టవచ్చు. కాని దానివల్ల ఒరిగేదేముంది. ఓసారి పెళ్లయిన వసంతకి తను మరో పెళ్లి చేయగలదా? ఇటూ అటూ కూడా దాని

గొంతు కోసింది తన తొందరపాటు. ఇలాగైనా మెట్టినింటికి పంపుతే గుడ్డిలో మెల్లగా ఆ యింట్లో బతకడానికి చోటుంటుంది. ఎటొచ్చీ పిల్లదాని మొహం చూడడానికి తనకే సిగ్గు వేస్తోంది.

ఇక వసంత తండ్రికి ప్రత్యేకమైన వ్యక్తిత్వం అంటూ ఎప్పుడూ లేదు. ఆ కన్యాదానం పది నిముషాలూ, ముళ్లకంచె మీద కూచున్నట్టు కూర్చుని లేచాడు. అంతే! మళ్లీ తన పేకాటా తనూ మాత్రమే. ఎవరో జరిగిన ఉదంతం చెప్పుకుంటూంటే "ఆఁ దానిదేముందిలే! కొన్నాళ్లు కాపురం చేస్తే అలవాటు పడిపోతుంది. లోకంలో అన్ని జోడీలూ సమ ఉజ్జీలుగానే ఉంటున్నాయా?" అని సర్దిచెప్పుకున్నాడు.

వచ్చిన వారిలో కొందరు సుభద్రమ్మ తొందరపడిందేమో నన్నారు. మరికొందరు "ఏం చేస్తుంది? చస్తుందేమిటి? ఎలాగోలా ఆ అడ్డు తీర్చుకోవాలి గదా" అన్నారు. ఏమైనా అది వారి జీవితాలతో ముడిపడిన సమస్య కాదు కాబట్టి గుమ్మం దాటగానే మరిచిపోయారు.

పెళ్లివారి బస్సు ఒక అదనపు మనిషితో తిరిగి నర్సీపట్నం చేరుకునేసరికి సాయంత్ర మైంది. బస్సు నడుస్తున్న గుంటసేపూ వసంత ఆలోచిస్తూనే ఉంది. నోరు మెదిపి ఎవరితోనూ మాట్లాడలేదు. ఎవరితో మాట్లాడాలి? ఏమని చెప్పుకోవాలి? వారిలో తనకి సన్నిహితులెవరు? ఎవరు ఎవరికి ఏమైతారో కూడా తెలియదు. జీవితంలో తను పెద్ద కోరికలేవీ పెట్టుకోలేదు. అందని మ్రానిపళ్లకి ఆశించలేదు. కోరికల గుర్రాల్ని అదుపుల కళ్లాల్తో ఆపు చేసింది. నేల విడిచి సాము చేయలేదు. కళ్ల ముందున్న నిజాన్ని స్వీకరించి సామాన్యమైన వైవాహిక జీవితాన్ని ఆశించింది. తనూ చదువుకుంది కనుక అవసరం అయితే ఆర్థికంగా భర్తకి సహాయపడి ఆనందంగా జీవించాలనుకుంది. కాని జీవితం తననెందుకిలా మోసం చేసింది?

బస్సు ఇంటి దగ్గర చేరేసరికి లోకం మీద చీకటి తెర పడింది. వసంత కూడా చీకటి మయమైన భవిష్యత్తులోకి ప్రవేశిస్తూ 'భగవంతుడా! నీవంటూ ఉంటే, పిసిరంత దీపం వెలిగించుకునే అదృష్టాన్ని ప్రసాదించు!' అనుకుంటూ ఇంట్లో అడుగు పెట్టింది. చుట్టాలంతా దగ్గరి, దగ్గరి ఇళ్లవాళ్లే కాబట్టి ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు. మిగిలింది కుటుంబ సభ్యులు, కొత్తగా వారిలో చేరిన వసంతను. భర్త కాక ఆ యింట్లో ఇంకా చాలా మందే ఉన్నారు. అత్తగారు, ఓ మరదలు, చిన్న మరిది సరే. పెళ్లయిన పెద్దాడపడుచూ, ఆమె భర్త నలభై ఏళ్లవాడూ, వాళ్ల ఇద్దరు పిల్లలూ కూడా ఆ యింట్లోనే ఉంటారు. అతనికి ఉద్యోగం సద్యోగం లేదు. ముప్పూటలా తిని ఊళ్లో బలాదూరు తిరగడం ఆయన పని. ఈ విషయం తనతో మొదటిసారిగా మాటలు కలిపిన మరిది సునీల్ చెపితే తెలిసింది. అతను ఇంటర్ చదువుతున్నాడు. మరదలు సురేఖ పదో క్లాసులో ఉంది.

కాలం భారంగా అడుగువేసుకుంటూ రాత్రి పదో గంటలో ప్రవేశించింది. భోజనాలై ఎవరి గదుల్లోకి వాళ్లు చేరుకున్నారు. పెద్దాడపడుచు కమల, వసంత చేయి పట్టుకుని నడిపించుకు వెళ్లి తన గది చూపింది. "ఈ రోజు నుంచీ వాడి మంచి చెడ్డలు నువ్వే చూసుకోవాలి" అని చెప్పి తలుపు వేసి వెళ్లిపోయింది.

అతను....

గదిలో ఓ ప్రక్కగా వాలు కుర్చీ మీద వాలి ఉన్నాడు. వసంత తల వంచుకుని పూర్వకాలపు పందిరి మంచం ప్రక్కగా అటు తిరిగి నిలబడింది. క్షణం ఆగి "ఇలారా! వసంతా!" అన్నాడు అతను. వసంతలో చలనం లేదు. మళ్లీ పిలిచాడు. "అన్నీ తెలిసి ఉండి, కావాలని పెళ్లి చేసుకుని మరి ఈ మౌనం ఏమిటి?" అన్నాడు. వసంత ప్రక్కన అగ్గి పిడుగు పడ్డట్టు త్రుళ్లిపడింది. గిరుక్కున వెనక్కి తిరిగి, "కావాలనా?" అంది. అతను "అవును. విషయాలన్నీ వివరంగా నీకు చెప్పామనీ, ముఖ్యంగా నా అంగవైకల్యం విషయం నీకు తెలిసే అంగీకరించావనీ చెప్పారు మా వాళ్లు. పెళ్లిళ్ల పంతులుగారు నిన్నెంతో పొగిడారు. నీ అందం చూశాక, నీ త్యాగం నీ అందానికి వన్నె తెచ్చిందని నేనెంతో సంతోషించాను... గ్రాడ్యుయేట్ నా జీవిత భాగస్వామి అవుతుందని నేను కలలో కూడా ఊహించని విషయాన్ని నువ్వు నిజం చేశావని పొంగిపోయాను" అన్నాడు.

అప్పటికి వసంతకి అర్థం అయింది. దగా పడింది తనొక్కర్తే కాదనీ. అతను కూడా మోసపోయాడనీ. అయితే ఆ మోసం వల్ల అతనికి జరిగిన అన్యాయం ఏమీలేదు.

ఇప్పుడు వసంత మనసు విచిత్రమైన ధర్మ సంకటంలో పడింది. నిజానికి ఈ వివాహ కారణంగా ఒకటి కావలసింది మేమిద్దరమూను. కాని అన్ని తతంగాలూ మా యిద్దరినీ మధ్యపెట్టి జరిగాయి. అతని కోరిక తీరే ఉండాలి కాని తీరంది నా కోరికే. మిగిలిన అందరి కోరికలూ తీరాయి. అమ్మా ఎలాగైనా తన పెళ్లి చేసి అత్తారింటికి పంపాలనుకుంది. ఆమె కోరిక తీరింది. నాన్న సరేసరి. అయనదీ ప్రపంచం కానేకాదు. పెళ్లిళ్ల పంతులుగారు వెయ్యి అబద్ధాలు ఖర్చుచేయకుండా చవగ్గా ఒక్క అబద్ధంతో పెళ్లి చేయించేశాడు. ఆయన కోరిక తీరింది. ఇటు అత్తగారికీ, ఇంట్లో మిగతావారికీ, ఈ అవిటివాడిని సాకడం ఒక తల నొప్పిగా ఉంది. ఏదో ఒకదాన్ని తెచ్చి ఇంట్లో పడేస్తే ఆ బాధలన్నీ అది పడుతుంది. వీళ్లంతా స్వతంత్రంగా ఎవరి దారిన వాళ్లు బ్రతకొచ్చు. కనుక వాళ్లందరి కోరకలూ తీరాయి. ఎంతటి స్వార్థపరులీ సంఘమూ, ప్రజలూను! జీవిత గమనంలో మానవుడెప్పుడూ ఏకాకే! నేను, నా వాళ్లూ అనేది వట్టి భ్రమ మాత్రమే! ఎవరూ ఎవరికీ ఏమీ కారు. అవసరం తీరగానే అందరూ చేతులు దులిపేసుకునే వారే అయినప్పుడు నేను మాత్రం నా స్వార్థం ఎందుకు చూసుకో కూడదు? ఎవరెవరికోసమో నా జీవితాన్ని చేజేతులా నేనెందుకు నాశనం చేసుకోవాలి? ఇంతమందిని సంతోష పెట్టడం కోసం ఈ అవిటివాడితో నేనెందుకు సంసారం చేయాలి? ఈ రోజు ఇతను నా భర్త. నిన్న అతనెవరో, నేనెవరో? కావాలంటే ఇటు పుట్టింటినీ, అటు మెట్టినింటినీ ఎదిరించి, నాకీ పెళ్లి ఇష్టం లేదని స్వతంత్రంగా బ్రతకొచ్చు. చదువుకున్న దానిని ఏదో ఉద్యోగం దొరక్కపోదు. ఇంకా నీచానికి దిగితే అమ్మ అన్నట్టుగా ఏ నుయ్యో, గొయ్యో దొరక్కపోదు. ఆత్మహత్య మహాపాపం అంటారు. ఆత్మవంచన అంతకు మించిన పాపం కాదా! తెల్లారి లేచి అంతటి మహాపాపం చేస్తున్న స్వార్థపరుల మాటేంటి?

శారీరకంగా అవిటివాడైన నా భర్త అమాయకంగా, ఒక విధంగా దోషిగా నా ముందు కూర్చుని ఉన్నాడు. భౌతికంగా దైవం అతణ్ని దెబ్బ తీసింది. ఇంటా, బైటా అందరూ అతణ్ని అవిటివాడని వేలెత్తి చూపించారు. దానితో అతను మానసికంగా కూడా కృశించి పోయాడు.

ఇప్పుడతనికి కావలసింది ఆత్మబలం. అతనికి సాంత్వన ఇచ్చి, ఆత్మ స్థైర్యాన్ని కలిగించితే మానసిక బలాన్ని పుంజుకోగలుగుతాడు. అప్పుడతనికి చేయూతనిస్తే తన అవిటితనాన్ని జయించగలుగుతాడు. జీవితానికి ఒక అర్థాన్ని చెప్పుకోగలుగుతాడు.

కాని ఈనాడు పిరికితనంతో నిజాన్ని కప్పిపుచ్చి, నకిలీ ఆపేక్షలతో రెండు నిండు జీవితాల్ని నాశనం చేయడానికి పూనుకున్న ఈ సంఘం, చుట్టాలు, పక్కాలు అంతా మానసికంగా అవిటివాళ్లేగా! ఈ అవిటి తనానికి మందేది? వీళ్లనెవరు బాగు చేయగలరు. పనికిరాని వాడని తృణీకరించి అతనిని ఓ మూల కూర్చోబెట్టిన సంఘానికీ, బంధువులకీ ఇతనూ మనిషే అనీ, సరైన సహాయాన్ని అందిస్తే అతనూ జీవితంలో విజయాన్ని సాధించగలడనీ నిరూపించగలగాలి. అప్పుడే ఈ సమాజం కళ్లు తెరుస్తుంది. విజ్ఞానశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో వికలాంగులకి ఎన్నో సదుపాయాలు వచ్చాయి. ఎన్నో స్వచ్ఛంద సంస్థలూ, ప్రభుత్వమూ వారికి ఉపాధులు కల్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా చేస్తున్నాయి. నేనూ అందులో ఒక భాగం ఎందుకు కాకూడదు?

"ఏం వసంతా? మాట్లాడవు? నిజాన్ని కళ్లారా చూశాక పొరపాటు చేశానేమో అని విచారిస్తున్నావా?" అతని ప్రశ్న పరిపరివిధాల ఆలోచిస్తున్న వసంతనీ ప్రపంచంలోకి తెచ్చింది.

కంగారుగా "ఆఁ! అదేం లేదు. ఆలోచనలో పడ్డాను!" అంది.

"వసంతా! నాకు తెలుసు. చూస్తూ చూస్తూ ఏ స్త్రీ కూడా నరక కూపంలోకి దిగడానికి అంగీకరించదు. నీకేమీ మొహమాటం కాని, భయం కాని అక్కర్లేదు. ఇప్పుడైనా 'నాకీ శిక్ష వద్ద'ని నువ్వు వెళ్లిపోవచ్చు. నిన్నెవ్వరూ బలవంతం చేయరు. నా జీవితానికి ఎలాగూ అర్థం లేకుండా పోయింది. నీ నిండు జీవితాన్ని బలి తీసుకునే అధికారం నాకెక్కడిది? ఎక్కడి కెళ్లినా నువ్విక్కడికంటె సుఖంగా బ్రతకగలవు. తుది నిర్ణయం నీదే" అన్నాడతను.

అతని విశాల హృదయాన్ని, జరిగిన పొరపాటుకి అతను పడుతున్న ఆవేదననీ అర్థం చేసుకున్న వసంత మనసులో ఒక దృఢ నిశ్చయానికి వచ్చింది.

మానవ నైజంలోని వైచిత్రి అదే! ఏరు వరదలై పారుతుంటే, ఒడ్డున ఉన్నంతకాలం అందులో పడకుండా ఉండే ప్రయత్నం చేస్తాడు మనిషి. ఖర్మకాలి పడక తప్పకపోతే, ఆ ప్రమాదం నుంచి బతికి బైటపడడానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తాడు. గడ్డిపోచనైనా ఆధారం చేసుకుని ఒడ్డుకు చేరాలని ఆత్రపడతాడు. ప్రాణికి సహజసిద్ధమైన గుణం అది.

వసంత ఇలా అంది: "మీరన్నది నిజమే కాని ఇందులో మీ ప్రమేయం ఎంతవరకు ఉన్నది అన్నది ఇప్పుడే తెలిసింది. మనమిద్దరమూ ఒకరికి తెలియకుండా ఒకరము మోసపోయాము. కాని ఈ ఓటమిని నేనంగీకరించదలచుకోలేదు. మీరు ఉన్నతమైన మనసున్నవారని అర్థం చేసుకున్నాను. మీరూ నన్నర్థం చేసుకుని, నాకు చేయూతనిస్తే మన జీవితాల్ని మంగళప్రదం చేయగలనన్న ధైర్యం నాకుంది. మీరు మనసారా నాతో సహకరించాలి మరి"- ఆ మాటలు విన్న అతనికి కొండంత బలం వచ్చింది.

"అవిటివాడిని కనుక ఓ ప్రక్కన కూర్చోబెట్టి ఇంతవరకూ ఇంట్లో ఎవరికి నచ్చినట్లు వారు ప్రవర్తిస్తున్నారు. కాని, నిజానికి ఈ రోజున ఇంటి పెద్దని నేను. నీ సహాయ సహకారాలుంటే నేను సాధించలేనిదేముంటుంది?" అన్నాడు.

"అయితే వినండి. ఈ రోజు నుంచీ మీరు అవిటివాడన్న విషయం మీ మనసులోంచి తీసేయండి. గత జీవితాన్ని మరచిపోండి. ఇప్పుడు నేను వచ్చాను. మీ అవిటితనం వెళ్లిపోయింది. ఒక మాట చెప్పండి. మీరు చదువుకున్నారు గదా!" వసంత అడిగింది.

"ఆహా! పదో తరగతి వరకు స్కూలుకెళ్లి చదువుకున్నాను. ఆ తరవాత 'నీకు చదువెందుకురా?' అని ఆపుచేశారు నా యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా. కాని ఇంటి దగ్గరే ఉండి, భారత, భాగవత, రామాయణాదులు చదువుకున్నాను. తెలుగు భాషలో మంచి ప్రవేశం ఉంది. ఇంగ్లీషు కూడా బాగానే వచ్చును. నవలలు చదవగలను" అన్నాడు అతను.

"కనుక నేను చెప్పేది శ్రద్ధగా వినండి. ఈ యింట్లో మళ్లీ మీ స్థానం యజమానిగా మీకు కల్పించే బాధ్యత నేను తీసుకుంటాను. మీరు మొహమాటపడి అభ్యంతరం పెట్టకండి. ఇలా నిర్వ్యాపారంగా కూర్చుంటే జీవితం నిరర్థకం అవుతుంది. మనం వికలాంగుల కోసం ఓ స్కూలు పెడదాం. నిరాశా, నిస్పృహలతో నిండిన వారి హృదయాల్లో ఆశాజ్యోతిని వెలిగిద్దాం. చిత్తశుద్ధితో కృషి చేస్తే మనకి ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వమూ చేయూత నిస్తాయి. మీకిది సమ్మతమేనా?" అడిగింది వసంత.

"అంతకంటేనా! నాకింతటి ఆత్మస్థైర్యాన్నిచ్చి చేదోడువాదోడుగా ఉంటానంటే మనస్ఫూర్తిగా నువ్వు చెప్పినట్టు నడుచుకుంటాను" అని చేతిలో చెయ్యి వేశాడు అతను.

వారి మొదటి రాత్రి అలా తెల్లవారింది.

* * *

తెల్లవారుతూనే పడకగదిలోంచి బైటికి వచ్చిన వసంత ఆ యింట్లో అందరిలాగే తనూ ఒక సభ్యురాలిగా ప్రవర్తిస్తూ అందరినీ అర్థం చేసుకుంటూ, తన ప్రణాళికకి ఒక రూపునిచ్చే కార్యక్రమంలో నిమగ్నురాలైంది. బాధ్యతలన్నీ నెమ్మదిగా వసంత వైపు మొగ్గసాగాయి. ఈ మార్పుకి అత్తగారు ప్రత్యేకంగా ఏమీ స్పందించలేదు. కాని మరిది మాత్రం మహా సంతోషిస్తున్నాడు. చిన్నాడపడుచుకి వదినగారంటే ఇష్టం ఏర్పడింది చదువులో అడపాదడపా సహాయకారిగా ఉంటోంది కనుక. ఇకపోతే పెద్దాడపడుచు కమలకి, ఆమె భర్త విశ్వనాథానికి నోట్లో వచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. వాళ్లకి ఇంతవరకు ఆడింది ఆట, పాడింది పాటగా ఉండేది. ఇప్పుడవేం సాగడం లేదు.

ఓ నాటి రాత్రి కమల భర్త నలభైయ్యోపడిలోని చిలిపితనంతో తింటున్న కంచంలోనే కన్నం పెట్టే ప్రయత్నం చేయనే చేశాడు. ఒంటరిగా ఉన్న వసంతతో, "వసంతా, ఈ యింట్లో మనమిద్దరమే పరాయివాళ్లం. ఆ అవిటివాడిని నమ్ముకుని జీవితంలో నువ్వేం సుఖపడ గలవు? నువ్వు సరే అని నాతో చెయ్యి కలిపితే వాళ్లందర్నీ ఒక ఆట పట్టించవచ్చు. మనం

హాయిగా బ్రతకవచ్చు. వీడికి, నీ అంత అందమైన దానిని కట్టబెట్టి వీళ్లంతా నీకు తీరని అన్యాయం చేశారు. నువ్వు వీళ్లందరిమీదా కసి తీర్చుకో. నీ కోసం నేను ఎంతటి త్యాగమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు.

వసంత మనసు దెబ్బతిన్న పెద్దపులిలా గాండ్రించింది. మానవుల్లో ఇంతటి పశువు తనెదుట సాక్షాత్కరించడాన్ని భరించలేకపోయింది. తనని తాను నిభాయించుకోలేక పోయింది. సాగదీసి అయిదు వేళ్లూ అంటుకునేలా లెంపకాయ కొట్టింది. "వెళ్లిపో! మళ్లీ నీ ముఖం నాకు చూపించకు" అని అతన్ని బైటికి త్రోసి తలుపేసేసుకుంది.

ప్రశాంతంగా ఉన్న ఆమె హృదయంలో - అలజడి బయల్దేరింది. ఆ రాత్రంతా ఆమె జాగరణ చేసింది. ఇది క్లిష్టమైన సమస్య. దీని పరిష్కారం అంత సులభం కాదు. వీళ్ళ నింట్లోంచి వెళ్లగొడితే 'రాక్షసి వచ్చి కుటుంబాన్ని విడదీసేసింది' అంటారు. ఊరుకుంటే దెబ్బతిన్న పాము ఏదో ఒకనాడు కాటువేయక మానదు. లేనిపోని అపోహలు, అనుమానాలూ కల్పించి అయినవాళ్ల మనసుల్ని విషపూరితం చేయవచ్చు. ఫలితంగా తన జీవితం నరకప్రాయం కావచ్చు. ఆలోచించి, ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది వసంత.

* * *

మర్నాడు ఆదివారం. అంతా ఇంట్లోనే ఉన్నారు. భర్త దగ్గరికి వెళ్లి, వాలు కుర్చీ ప్రక్కగా కూర్చుని, "ఏమండీ! నేనొక కోరిక కోరుతున్నాను. నేనే చెడ్డదాన్నని అనుకున్నా సరే! ఇది మాత్రం మీరు తప్పక తీర్చాలి. ఒక విధంగా మీకిది పరీక్ష. అయినా తప్పదు" అంది.

"వసంతా! నా జీవితంలో కోల్పోయిన ముప్ఫై వసంతాలు మళ్లీ నా కళ్లకి చూపించావు. వీడిని మళ్లీ మనిషిగా చేయడానికి కంకణం కట్టుకున్నావు. ఈ ప్రయత్నంలో నీతో సహకరించడమే నా ధ్యేయం. చెప్పు నీ కోరిక నిరాకరించడం అంటూ ఉండదు. అది నీ ఆజ్ఞగా అమలు పరుస్తాను" అన్నాడామె భర్త.

"మీ కమలా, కుటుంబం తక్షణం ఈ యింట్లోంచి వెళ్లిపోవాలి. కారణాలు నన్నడగొద్దు" అంది వసంత, నిశ్చలంగా, నెమ్మదిగా, కఠినంగా.

"ఇదుగో! నీ ఎదుటే చెప్పేస్తాను" అని కమలనీ, విశ్వనాథాన్నీ గదిలోంచి పిలిచి, సాయంత్రంలోగా ఇల్లు ఖాళీ చేసి వెళ్లి పోవాలనీ, నెల రోజులకి సరిపడ తిండి సామానూ, ఇంటి అద్దెకు డబ్బు ఇస్తున్నాననీ చెప్పాడు అతను. కమల గోల పెట్టింది. "తమ్ముడూ! నిన్నగాక మొన్న వచ్చిన ఆమె మాట విని, మమ్మల్ని అన్యాయం చేస్తావా! ఇలా అర్ధాంతరంగా వెళ్లిపొమ్మంటే, మేమూ, పిల్లలూ ఏమైపోవాలి?" అని. ఏమీ లాభం లేకపోయింది. విశ్వనాథం ఖంగుతిన్నాడు.

వసంత ఇప్పుడు కశింభొట్ల వారి కులదైవం. చిన్న మరదలూ, మరిదీ ఆమెను దేవతలా ఆరాధిస్తారు. ఆ వూళ్లోని వికలాంగ బాలబాలికలకి వారిల్లొక దేవాలయం. *